# ముగింపు మీకూ తెలుసు

బొకారో వెళ్ళాల్సిన ఎక్స్‌ప్రెస్ గంటన్నర లేటన్నారు. చూడడానికి చాలా పెద్దదే అయినా కూచోడానికి ఎక్కడా సదుపాయం లేని వాల్తేరు ప్లాట్ ఫారం. బొత్తిగా పార్సిలు మీదో ఎవరిదో బెడ్డింగుమీదో కూచోడానికి ఎటూ పెద్దమనిషి తరహా అడ్డొస్తోంది. నుంచుని నుంచుని కాళ్ళు లాగాయి. తరచు చేసే ప్రయాణం రైల్లో కూచోవలసిన కాలంకంటె రైలుకోసం నిరీక్షించవలసిన కాలమే ఎక్కువ కావడంతో ప్రాణం ఉస్సురని విసుక్కుంది.

రైలు వచ్చింది. టూటయ్యర్‌లో కూచోవడం పరిపాటే అయినా ఆరోజు ఎందుకో జనరల్ కంపార్టుమెంటు దగ్గరకు వెళ్ళాను. రాసిపెట్టి ఉన్నది తప్పించడం, ఎవరికిసాధ్యం? ఆ తరువాత అనుకున్నాను.

నేను ఎక్కిన పెట్టె జనరల్ అయినా మిలిటరీ అని పెద్ద పెద్ద చీటీలు అంటించి ఉన్నాయి. కిటికీదగ్గర ఒకాయన గేటుదగ్గర మరొకాయన నుంచుని ఇది మిలిట్రీ మిలిట్రీ రిజర్వేషన్ వెనక్కి, వెనక్కి, వెళ్ళండి అంటూ ప్రజల్ని తరివేస్తున్నారు. నేను ఎక్కుతుంటే మాత్రం నన్ను వారించలేదు.

వారించి ఉన్నా నాకు కొన్ని క్షణాల యాతన తప్పిపోయేదేమో!

ఏదైనా 'గీత' అన్నది మన రక్తంలో నమ్మకమే కదా! మిలట్రీవాళ్ళా పెట్టెలో ఓ పదిమందికంటె లేరు. వాళ్ళు మీదని పక్కలు పరిచెయ్యడమే కాకుండా జంబుఖానాలూ, దుప్పట్లూ కూడా కింద సీట్లమీద పరిచేశారు. జనం కిటకిటలాడుతున్నారు. వాళ్ళు అడ్డుతూ వున్నా ఇంతమంది పెట్టెలోకి ఎలా వచ్చారో అర్థంకాలేదు. ఒక్కక్షణం తటపటాయించి జంబుఖానా మెల్లగా పక్కకి మడిచి మెల్లగా సీటుమీదికి శరీరాన్ని దింపాను. పక్కనున్న మిలట్రీ మనిషి నా బ్యాగ్ తన బెర్తమీద పెట్టాడు. రైల్లో కూచోవడంతో నా బాధ్యత సరి. అది నే చేరవలసిన గమ్యం చేరేవరకూ విశ్రాంతి. హాయిగా గాలి పీల్చుకుని కిటికీ సీటు వంక చూశాను.

ఆవిడ-ఆవిడనేకంటె ఆ అమ్మాయి అనడమే న్యాయం నా కంటె చాలా చిన్నది కాబట్టి. ఆ అమ్మాయి నావంకే చూస్తోంది. నేనే కళ్ళు తిప్పుకున్నాను.

ఎదురుగా ఓ మార్వాడీ ముసలావిడ. ఆమె పక్క ఓ చిన్నపాప అయిదేళ్ళుంటవచ్చు చాలా అనారోగ్యంగా కనపడుతోంది.

"నాన్నగారు వచ్చారు. నువ్ అటుజరుగు."

నా కళ్ళలోకి చూసి 'అమ్మాయి' అంది. ఆయన్ని చూసి ఆ పాప జరగబోయింది. కాని చటుక్కున జరగడానికి శరీరంలో శక్తిలేదు. ఆ పాపని రెండుచేతులతోనూ పక్కకి జరిపి అతను కూచున్నాడు. అంతకంటె కిటికీసీటుకి దగ్గరగా కూచోడం సాధ్యంకాదు.

ఎందుకో ఆ పాపనే మళ్ళీ మళ్ళీ చూడాలనిపిస్తోంది. సన్నాగా పుల్లల్లా అయిపోయిన కాళ్ళు. పుల్లల్లాంటి చేతులకి ఆకుల్లాంటి మండలు అంటించినట్లున్నాయి. మండమీద వెయిన్స్ అంత

చిన్నపిల్లల్లో అంతలా కనపడటం చాలా ఆశ్చర్యకరంగా ఉంది. వైద్య పరిభాషలో దాన్ని ఎమాసియేటెడ్ కండిషన్ అంటారు. పిల్ల ప్రాణమంతా కళ్ళల్లో ఉంది. దీక్షగా చూస్తున్న నావంక ఆ పాప తీక్షణంగా చూస్తోంది. మళ్ళీ కళ్ళు తిప్పుకున్నాను. ఏడాది తిరగకుండా చనిపోయిన మా చంటిబాబు జ్ఞాపకం వచ్చాడు. నా కళ్ళు చెమ్మగిల్లడం ప్రారంభించాయి. మళ్ళీ కిటికీ సీటు వంక చూసేసరికి ఆ అమ్మాయి నావంక చూస్తోంది. నేను చేస్తున్నపనే ఆవిడా చేస్తోంది. మిలమిల లాడుతున్న కళ్ళు. పసుపుతాడు. కుత్తిగంటు. కొత్త పెళ్ళికూతురు కళ. కొత్తచీర. పెళ్ళి కూతురైతే మరి వడిలో...సంవత్సరం పైబడ్డ మగబిడ్డ. పుల్లల్లాంటి కాళ్ళు. పెద్ద కళ్ళు. కళ్ళలో కూడా జీవంలేదు. అదిరిపడి చంటిబాబువంకా, ఆ పాప వంకా మార్చి మార్చి చూస్తున్నా.

ఆ బాబు ఆ పాప తమ్ముడు. ముఖ్యంగా ఆ కళ్లు ఇద్దరూ ఓ తల్లి పిల్లలే.

కాళ్ళకు మట్టెలు. కొత్తగా మెరుస్తున్నాయి. జోడు కిందకి వదలి కాలు సీటుమీద పెట్టుకుని బొటనవేలు చూసుకుంటోంది ఆ అమ్మాయి. కొత్త జోడు కరిచేసినట్టుంది. చెక్కురుపోయి ఎర్రగా వేలు.

"ఓలమ్మ యెంత కసటమైపోనాది!" ఉస్సురంటూ ఓ ముసలమ్మ ఐదారేళ్ళ పిల్లవాడి నొకడిని తీసుకొచ్చి నేలకూలబడింది. ఆమె వెనకాలే వయసు తెలియని గ్రామీణ స్త్రీ-

మరో పది నిముషాల్లో బండి కదిలింది. టిక్కెట్టు కలెక్టరు వచ్చి టిక్కెట్లు చెక్ చేస్తున్నాడు. ఆ ముసలమ్మని టిక్కెట్టు అడిగేసరికి దూరంగా నుంచున్న ఓ వ్యక్తిని చూపించింది.

కిటికీ సీటు అమ్మాయి పెద్దకళ్ళు చేసుకుని అటు చూస్తోంది.

"బాబ్బాబు, బొబ్బిలికి టిక్కెటు దీయమని పదిరూపాయలు నోటిచ్చినాను. మరోటి కావాలన్నాడు. ఇచ్చినాను. నాకు తీసి బొట్టెడికి తియ్యకపోడఁవేటి? ఆ టిక్కటూ యియ్యనంటున్నాడు. నేనేటి సేతును బగమంతుడా! ఆడదాన్నని ఆడన్నేయం సేసినాడు. ఇతగాడు సిచ్చేసెస్తాడట!"

లబలబ లాడింది ముసిల్ది.

ముసలమ్మ పక్క చతికిలబడ్డ ఆవిడ ఏదో సర్ది చెప్పజూస్తోంది. టిక్కెట్టు కలక్టరు వాళ్ళని పక్కకు తీసుకెళ్లాడు.

కిటికీ అమ్మాయి వడిలో చంటాడు. ఎండిపోయిన తోటకూర కాడలా మెడ వేలేశాడు. ఏడవడానికి కూడా శక్తిలేక ఈఁ ఈఁ అంటున్నాడు. ఆవిడ సీసాలో నీళ్ళు తాగి వాడి నోటిలోసీసామూతి పెట్టింది. వాడు అలా నీళ్ళు తాగగలడా అన్న ఆలోచన ఆమెకు వచ్చినట్టు లేదు. చెయ్యి వేసి చూడక్కరలేకుండానే లివర్ బాగా ఎన్‌లార్జ్ అయినట్టు కనపడుతోంది. ఎంతో జాగ్రత్తగా వైద్యం చేయిస్తేకాని ఆ బిడ్డను దక్కించుకోవడం అసాధ్యం. నా చూపుని గమనించిద్ది ఆవిడ. బిడ్డ పొట్ట మీద చొక్కాను సరిచేసి కిందకు లాగింది.

నా వంక ఓమారు ఓరగా కొంటెగా (నా భావనమో!) చూసి అతనితో మాటల్లోకి దిగింది.

కొత్త జంటకి కబుర్లకేం లోటు. ఏమిటేమిటో మాటాడేసుకుంటున్నారు.

పాప తండ్రివంక చూస్తున్న జాలిచూపులో యెన్ని భావాలు! జీవితాన్నంతటినీ అర్థం చేసుకున్న వేదాంతి చూపు అది. ఆ పసిపిల్లను చూసి గుండె చెరువవడం అంటే యేమిటో అవగాహన కొచ్చింది.

ఎంత వెలుగుగా ఉన్నాయి ఆ కళ్ళు. క్షయరోగం బాగా ముదిరిన లక్షణం అది. నాకు శరీరం వేడెక్కేటంత ఆవేశం వచ్చింది.

ఆ చంటివాడికీ, కిటికీసీటు అమ్మాయికీ ఆయనకీ, పాపకీ ఏమిటి సంబంధం?

నా ఆలోచన ఆగడంలేదు.

ఆమె జాకెట్టులోంచి ఏదో చిన్న చీటీ తీసింది. ఓమారు చీటీని అరచేతిలోనే విప్పి చూసుకుంది.

ఏమిటది? అతను గోముగా అడిగాడు.

ఏం లేదు సిగ్గుగా, చిలిపిగా ముఖం పెడుతూ కాగితం చూపించినట్టే చూపించి లాగేసుకుంది. కొంతసేపు ఆ ఆట అయ్యాక కాగితం అతను లాక్కుని చూశాడు. ఇద్దరూ గలగలా నవ్వుకున్నారు. ఆమె కంటిలో వగలు, వలపు కొంటెతనం అతనికే కాదు నాకూ చూపు మరల్చుకోడం అసాధ్యమైపోయింది.

రైలు, ఇతర ప్రయాణీకులు చుట్ట వాసన ముసలమ్మ గొణుగుడు నా పరిశీలన ఇవేవీ వాళ్ళకు పట్టడంలేదు. వారి ప్రపంచంలో వాళ్ళున్నారు. పాప నిస్త్రాణగా వెనక్కి జేరబడిపోయింది. వడిలోని చంటిబాబు ఊహకందని ఆలోచనలతో నిద్రలాంటి మగతలో ఉన్నాడు.

ఇంతలో అతను వక్కపొడి పొట్లాం జేబులోంచి తీసి ఆమెకు కాస్త పెట్టి, పక్కనున్న పాప చేతిలో ఓ పలుకు వేసి అతనూ వేసుకున్నాడు.

దానికెందుకు, మతిలేకపోతే సరి! మందలించింది ముద్దుగా ఆమె.

నాకు పిల్లల ఆరోగ్యస్థితే మనసును కలవరపరుస్తోంది. పాపకి టి.బి. అని వైద్యశాస్త్రం చదవనివాళ్ళకి కూడా తెలిసిపోతుంది. బాబుకి లివర్ ఎన్‌లార్జిమెంట్. ఈ పిల్లలు బ్రతుకుతారా? జీవితం విలువ ఈ దంపతులకెలా తెలుస్తుంది.

వీళ్ళకు తెలిసేటట్లు చెప్పే బాధ్యతను నేను స్వీకరిస్తే?

"నువ్వెవ్వరివి?" అని, ఆ మెరుస్తున్న కళ్ళమ్మాయి అడిగితే? నేనేం చెప్పాలి?

మెల్ల మెల్లగా విషయం విశదమౌతోంది.

చూశారా న్యాయం ఇలా ఉంటుంది నా పక్కనుండి లేచి వెళ్ళినాయన నిట్టూరుస్తూ నా పక్కకు వచ్చి కూచున్నాడు.

"ఏమైంది?"

"ఆ ముసలమ్మ దగ్గర డబ్బు తీసుకుని టిక్కెట్టు కొనకుండా డబ్బు కొట్టెయ్యాలని చూశాడు."

"అయితే ఏంచేశారు?"

"వాడి టిక్కెట్టు ముసలమ్మకిప్పించేశాను."

"మరి చిన్నవాడి టిక్కెట్టు?"

"బొబ్బిల్లో టి.టి. చెప్పి పంపిస్తానన్నాడు."

నేను చెయ్యగలిగి చెయ్యనిపనిని అతను చేశాడు. న్యాయం గురించి ఆలోచిస్తూ ఏం చెయ్యకుండా కూచున్నాను.

ఈ పాపల సంగతి.

చటుక్కున స్ఫురించింది.

ఈ బిడ్డల తల్లి కళ్ళు మూసి ఉంటుంది. రెండో పెళ్ళి చేసుకున్నాడతను. ఆ కిటికీ సీటమ్మాయికి కొత్త సంసారం వయసు తీపి. నూతన దాంపత్యం. దాని సొగసు, దాని మెరుగు, దాని హాయి వీటితోపాటు బరువైన బాధ్యతలనూ స్వీకరించే మానసిక పరిపక్వత ఆ వయసులో, ఆ సందర్భంలో సాధ్యమా?

లేచి బ్యాగు తీశాను.

ప్యాడ్‌లోంచి కాగితం తీసి రెండువాక్యాలు రాశాను. విజయనగరం స్టేషనొచ్చేసింది. బ్యాగ్ మూసి పెన్ను జేబులో పెట్టుకుని ఆమెవంక చూశాను.

మాసపత్రిక చదువుకుంటోంది దీక్షగా. వడిలోని చంటివాడి తల వేలాడిపోతోంది.

నేను ఇంటికి రాగానే బ్యాగు సవరించడం మా అమ్మాయికి అలవాటు.

ప్యాడ్‌లో నుంచి చింపిన కాగితం మీద రాసిన వాక్యాలు దానికి అర్థం కాలేదు.

నేను ధైర్యంగా, సినిమాలో కథలోలా, కల్పనలోలా ఆమెకందివ్వాలనుకుంటున్న కాగితం

"ప్రాణంకంటె విలువైంది ఏదీలేదు. పిల్లలకు వెంటనే వైద్యం చేయించి వాళ్ళ ప్రాణాలు కాపాడండి."

కథవేరు నిజం వేరు. ధైర్యం చెయ్యలేకపోయానన్నమాట, కాగితం ఇవ్వడానికి.

అసలు నేనెందుకు రాశాను ఆ కాగితం?

వృత్తిరీత్యా జాలిపడడం నా బాధ్యత కాబట్టి కదూ! మరి బాధ్యతను. నిర్వర్తించడానికి ఎందుకు వెనకాడానూ?

అదే సమస్య! అదే మానవ స్వభావం. చెయ్యాలనుకున్నా, చెయ్యడం మంచిదనుకున్నా చెయ్యగలిగీ చెయ్య కపోడం మనిషికి అడపాదడపా ఎదురవుతున్న మనసుని కలవరపరిచే చేదు నిజం

కాని, ఆ పిల్లలు, ఆ పిల్లలు - వారి కథ ముగింపు మీకూ తెలుసు.

జ్యోతి ఆగష్టు 1979